ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 03.08.2025 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. దేశంలో చేనేత పరిశ్రమకు చేయూతను అందించడానికి కేంద్ర ప్రభుత్వం పలు ప్రణాళికలు అమలు చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

2. రైతుల సంక్షేమం , వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టు బడి వుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.

3. గోదావరి జలాలలో తెలంగాణ రాష్ట్రానికి ఉన్న 968 టీఎంసీల నీటి వాటాను సంపూర్ణంగా వినియోగించుకునేలా ప్రాజెక్టు నిర్మాణాలు చేపడతామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

4. తెలంగాణలో రాగల 24 గంటల్లో వర్షాలు కురుస్తాయని , ఈ ఆగస్టు నెలలో ఆశాజనకంగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**చేనేత**

దేశంలో చేనేత పరిశ్రమకు చేయూతను అందించడానికి కేంద్ర ప్రభుత్వం బహుముఖ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలను ఆయన ఈరోజు ప్రారంభించారు. వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మందికి ఉపాధిని అందిస్తున్న చేనేత రంగం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పలు సంస్కరణలు చేపడుతోందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఏడు పీఎం మిత్ర టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించిందని అందులో ఒకటి తెలంగాణకు కేటాయించిందని ఆయన వెల్లడించారు.

డెస్క్

**భట్టి విక్రమార్క**

రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు అమలు పరుస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కామలాపూరం గ్రామంలో 10కోట్ల రూపాయలతో నిర్మించనున్న గోదాముల నిర్మాణానికి ఆయన ఈరోజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ..  గత దశాబ్ద కాలంలో సాగు నీటి రంగం పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించిందని కృష్ణా, గోదావరి నదులపై గతంలో కాంగ్రెస్

ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులే పంట పొలాలకు ప్రస్తుతం నీళ్లు అందిస్తున్నాయని ఆయన అన్నారు.

బైట్.. భట్టి విక్రమార్క

PTC, khammam

**కేబినెట్ సమావేశం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రేపు తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరగనుంది. క్యాబినెట్ ముందుకు కాళేశ్వరం కమిషన్ నివేదిక తీసుకురానున్నారు. ఈ రోజు సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీకానున్నారు. అలాగే అధికారుల కమిటీతో మంత్రి సమావేశాన్ని నిర్వహించనున్నారు.

డెస్క్

**ఇందిరమ్మ ఇళ్లు:**

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం మరింత సహకారాన్ని అందించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ గృహనిర్మాణ పథకానికి సంబంధించి అనేక నిబంధనలు విధిస్తోందని ఆయన అన్నారు. ఒక్కో ఇంటికి గ్రామాల్లో 72వేల రూపాయలు, పట్టణంలో లక్షా 52వేల రూపాయలు అందిస్తోందని కానీ, తమ ప్రభుత్వం ఒక ఇంటికి 5 లక్షల రూపాయల

చొప్పున ఇస్తున్నదని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనతో చేపట్టిన రీ సర్వే తుదిదశలో ఉందని తెలిపారు.

డెస్క్

**జాతీయ రహదారులు:**

జాతీయ రహదారుల విస్తరణలో 2024-25 సంవత్సరంలో తెలంగాణలో 2,526 కిలోమీటర్ల మేర రోడ్లను విస్తరించినట్లు కేంద్ర ఉపరితల రవాణా శాఖ వెల్లడించింది. 2024 మార్చి 31 నుంచి ఈ ఏడాది జూన్ 30 వరకు జరిగిన పనుల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్లు ఆ శాఖ పేర్కొంది.

డెస్క్

**రేషన్ కార్డులు**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని, ఇప్పటి వరకు 8 లక్షల 64 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. 84% జనాభాకు ఉచితంగా సన్న బియ్యం రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో 45 కోట్ల 15 లక్షలతో నిర్మించే ఐటీఐ భవనం నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చే శారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన రేషన్

కార్డులను పంపిణీ చేశారు.   ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

పీటీసీ, పెద్దపెల్లి జిల్లా

**ప్రత్యేక రైలు**

కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6 వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పేర్కొంది. ఇందుకోసం ఢిల్లీ కి ప్రత్యేక రైలుని ఏర్పాటు చేశామని , రేపు ఉదయం 9 గంటలకు చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ఈ రైలు బయలుదేరుతుందని  తెలియజేసింది.

డెస్క్

**ముర్మూరు ఎత్తిపోతల:**

గోదావరి జలాలలో తెలంగాణ రాష్ట్రానికి ఉన్న 968 టీఎంసీల నీటి వాటాను సంపూర్ణంగా వినియోగించుకునేలా ప్రాజెక్టు నిర్మాణాలు చేపడుతామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని ముర్మూర్ ఎత్తిపోతల పథకాన్ని ఈరోజు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ పథకం ద్వారా అంతర్గాం, పాలకుర్తి మండలాల గ్రామాలలోని ఆయకట్టుకు సాగు నీరు అందుతుంది. ఈ

సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, నీటి హక్కులకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మించేందుకు ప్రయత్నిస్తోందని కేంద్ర జలసంఘానికి ఫిర్యాదు చేసి.. ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకున్నామని అన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర బ్యారేజ్ పునర్నిర్మాణం చేస్తామని అలాగే ఇచ్చం పల్లి దగ్గర మరో ప్రాజెక్టు నిర్మిస్తామని ఆయన వెల్లడించారు.

బైట్.. ఉత్తమ్ కుమార్ రెడ్డి

పీటీసీ, పెద్దపల్లి జిల్లా

**అక్రమ ఇసుక రవాణా :**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పేరుతో అక్రమంగా ఇసుక, మట్టి రవాణా చేసే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని రాజన్న సిరిసిల్లా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పనిదినాలలో ప్రభుత్వం ఇసుక, మట్టి తరలించేందుకు అనుమతి ఇచ్చిందని.. ఈ నిబంధనలను అతిక్రమించినవారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన అన్నారు. అక్రమ మట్టి, ఇసుక రవాణా జరుగుతోందన్న సమాచారంతో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించగా.. కొన్ని ట్రాక్టర్లను వేములవాడ ఆర్డీవో సీజ్ చేశారని ఆయన వెల్లడించారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**రామాయంపేట:**

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం తగిన కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఈరోజు ఆయన సైకిల్ పై 20 కిలోమీటర్లు ప్రయాణించి.. రామాయంపేట ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు వైద్య సదుపాయాలు ఏ విధంగా అందుతున్నాయో పరిశీలించారు

పీటీసీ, మెదక్ జిల్లా

వాతావరణం:

తెలంగాణలో రేపటి నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. దక్షిణ, పశ్చిమ, మధ్య తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. రాగల రెండురోజుల్లో మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగానే ఉంటాయని, ఉదయం, సాయంత్రం వేళల్లో ఆకస్మికంగా వానలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

డెస్క్